ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్‌ సంతృప్తి

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ భారతి హోలీకేరి బుధవారం సందర్శించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పరిశీలించారు. అందులో భాగంగా శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్‌ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌లో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఆ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా....? లేదా....? అనే అంశాలను ఆమె ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్‌ సామగ్రిని పక్కాగా అందించాలని చెక్‌లిస్ట్‌ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా....? లేదా....? అని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని కలెక్టర్‌ ఎన్నికల అధికారులకు సూచించారు. పోలింగ్‌ సిబ్బందితోపాటు ఓటింగ్‌ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా ఆమె పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్‌ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేస్తుండాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్‌ఓలకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్‌ కూడా ప్రశాంతంగా జరిగేలా ఆమె తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్‌ వెంట రిటర్నింగ్‌ అధికారి బి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్కుల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికల సందర్భంగా గ్రేటర్‌లోని హెచ్‌ఎండీఏ పార్కులన్నింటినీ గురువారం మూసి ఉంచనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు నెక్లెస్‌రోడ్డులోని లుంబినీ, ఎన్టీఆర్‌పార్కు, లేక్‌వ్యూ, తదితర పార్కులలో సందర్శకులకు ప్రవేశం ఉండదు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- 1500 మంది సిబ్బంది
- 500 మంది పోలీసుల వినియోగం
- 30 సమస్యాత్మక పోలింగ్‌ బూత్‌ల గుర్తింపు...
- ప్రతి పోలింగ్‌ బూత్‌లో కనీస సౌకర్యాలు కల్పించాం...
- ముషీరాబాద్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి లక్ష్మీనారాయణ

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్‌ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ముషీరాబాద్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి వి. లక్ష్మీనారాయణ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...'ముషీరాబాద్‌ నియోజకవర్గంలో మొత్తం 3,01,788 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 1,46,607 మంది కాగా, పురుషులు 1,55,168 ఉన్నారు. ఇతరులు 13 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్యకు తగినట్లుగా



ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది

289 పోలింగ్‌ బూత్‌ల ఏర్పాటు

- నియోజకవర్గంలో 289 పోలింగ్‌ బూత్‌లు ఏర్పాటు చేశాం.
- ఒక్కో పోలింగ్‌ బూత్‌కు ఒక ప్రిసైడింగ్‌ ఆఫీసర్‌, అడిషనల్‌ పోలింగ్‌ ఆఫీసర్‌, అసిస్టెంట్‌ పోలింగ్‌ అధికారులు ఇద్దరు, ఒక అటెండర్‌ చొప్పున ప్రతి పోలింగ్‌ స్టేషన్‌కు 5గురు సిబ్బందిని కేటాయించాం.
- ఎన్నికల నిర్వహణకు గాను నియోజకవర్గ వ్యాప్తంగా 289 పోలింగ్‌ బూత్‌లకు మొత్తం 1500 మంది సిబ్బంది తోపాటు 500 మంది పోలీసు సిబ్బంది పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో 30 సమస్యాత్మక పోలింగ్‌ బూత్‌లను గుర్తించాము, ఆయా పోలింగ్‌ స్టేషన్లలో అదనపు బలగాలను మోహరిస్తాం. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ పార్టీలతో పాటు స్వాతంత్ర్య అభ్యర్థులు 31మంది బరిలో ఉన్నారు.
- ముందు జాగ్రత్త చర్యగా 289 పోలింగ్‌బూత్‌ల ఈవీఎంల తోపాటు మరో 91 ఈవీఎంలను అదనంగా ఏర్పాటు చేశాం. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులతోపాటు ట్రైసైకిళ్లు ఏర్పాటు చేశాం.వాటితో పాటు వలంటీర్లను నియమించాం.
- నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 24మంది హోం ఓటుకు అప్‌లై చేసుకున్నారు.
- ఉ.7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌ బూత్‌లో ఎంతమంది ఉన్నా వారందరికి ఓటు వేసే అవకాశం కల్పిస్తాం.నియోజకవర్గం వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 289 పోలింగ్‌ బూత్‌లలో ఓటర్లకు మంచినీరు, కరెంటు, ఫర్నీచర్‌ వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశాం.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

అంబర్‌పేట్‌లో పోలింగ్‌ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

అంబర్‌పేట్‌: నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటింగ్‌ నిర్వహణకు 239 పోలింగ్‌ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా బూత్‌ల పరిధిలో ఓటర్‌ స్లిప్‌ల పంపిణీ పూర్తయ్యింది. నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో పాటు 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒక్కొక్క పోలింగ్‌ బూత్‌లో రెండు ఈవీఎంను వినియోగించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి పరిశీలించారు. బుధవారం ఆయన ఆర్‌వో అపర్ణ, ఈఆర్‌వోలు మారుతీ దివాకర్‌, భిక్షపతిలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈవీఎం యంత్రాల పంపిణీ, సిబ్బంది విధులు తదితర అంశాలపై చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నియోజక వర్గ పరిధిలో 2,77,103 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,40,206 మంది కాగా. మహిళలు 1,36,853 మంది ఉన్నారు. ఇతరులు 14 మంది ఉన్నట్లు ఈధికారులు తెలిపారు. ఇందుకుగాను 239 పోలింగ్‌ బూత్‌లను ఏర్పాటు చేశారు.



రెడ్డి కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌

పటిష్ట బందోబస్తు:

నియోజకవర్గంలో ఎన్నికలు శాంతియుతంగా ,ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్‌ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని నోడల్‌ అధికారి, కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్‌ తెలిపారు. నియోజకవర్గంలో 104 పోలింగ్‌ కేంద్రాల భవనాల వద్ద ఆదనపు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. 44 పోలింగ్‌ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించమన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రత చర్యలు తీసుకున్నమన్నారు. వదంతులు నమ్మకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పోలీసు స్టేషన్‌ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని సీఐ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్‌ నియోజకవర్గంలోని తార్నాక, లాలాపేట, రవీంద్రనగర్‌, నాగార్జునగర్‌ ఉప్పల్‌ నియోజకవర్గంలోని హబ్సిగూడ, పీ అండ్‌ టీ కాలనీ, రవీంద్రనగర్‌, ఓయూ క్యాంపస్‌లోని బస్తీలు, అంబర్‌పేట్‌ అసెంబ్లీ నియోజకవర్గాలలోని అడిక్‌మెట్‌ వైపు గల ఓయూ క్యాంపులలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఓయూలో పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని 53 పోలిగ్‌ కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఓయూ పోలీసులు, ఐదుగురు ఎస్‌ఐలతో పాటు అదనంగా 130 మంది సిబ్బంది మోహరించిన్నట్లు చెప్పారు. తార్నాక డివిజన్‌లోని నాగార్జునగర్‌, మాణికేశ్వనర్‌ను సమస్యాత్మక ప్రాంతాలుగా గురించి పోలీసు బలగాలను భారి సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడిన వెంటనే 8712660562 నంబర్‌కు ఫోన్‌ చేయాలని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.

రాంనగర్‌ చౌరస్తాలో దీక్షా దివస్‌



దీక్షా దివస్‌లో పాల్గొన్న వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్‌: తెలంగాణ ప్రజలు అమరవీరులను ఎప్పటికి గుర్తుంచుకుంటారని మాజీ కార్పొరేటర్‌ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దీక్షా దివస్‌ సందర్భంగా రాంనగర్‌ చౌరస్తాలో సీనియర్‌ నాయకులు సిరిగి శ్యామ్‌ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 13 ఏళ్ల క్రితం నవంబర్‌ 29న సీఎం కేసీఆర్‌ నిరవధిక సమ్మెకు దిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, బుజ్జి వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి కిరణ్‌, కార్తీక్‌యాదవ్‌, భిక్షపతి, పున్నం ప్రవీణ్‌, బొమ్మిడి వీరస్వామి, సత్యనారాయణ, దయాకర్‌, ఖలీద్‌, అరుణ్‌, రాజేష్‌, టక్కర్‌ శ్రీనివాస్‌, అద్నాన్‌, ఇయాజ్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వాకథాన్‌

లక్డీకాపూల్‌ : మూవ్‌మెంట్‌ డిజార్డర్స్‌ సమస్యల పరిష్కారానికి నిమ్స్‌ యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప పేర్కొన్నారు. వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి, అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బుధవారం నిమ్స్‌లో ప్రపంచ మూమెంట్‌ డిసార్డర్‌ దినోత్సవం సందర్భంగా వాక్‌థాన్‌ జరిగింది. నిమ్స్‌ న్యూరాలజీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిమ్స్‌ డీన్‌ డాక్టర్‌ లిజా రాజశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ.. మూమెంట్‌ డిసార్డర్‌ సమస్యతో బాధపడేవాళ్ల శరీరంలో కదలికలు లేకుండా ఉండే ప్రమాదం ఉందని, దాని వల్ల ఆయా వ్యక్తులు తమ తమ జీవనగమనంలో స్తబ్దత నెలకొంటుందన్నారు. ఫలితంగా ఏం చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా కదలకపోవడం రుగ్మతను ఎదుర్కొంటారన్నారు. తొలుత నిమ్స్‌ క్యాంపస్‌లోని ట్రామా బ్లాక్‌ నుండి ఓల్డ్‌ ఎంట్రన్స్‌ వరకు మూమెంట్‌ డిసార్డర్స్‌ ఉన్న రోగులకు మద్దతుగా న్యూరాలజీ, ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం, న్యూరోసర్జరీ, ఫిజియోథెరపీ, నర్సింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన సీనియర్‌ వైద్యనిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైలెంట్‌ వాక్‌ నిర్వహించారు.ఢిల్లీ ఎయిమ్స్‌ నుంచి డాక్టర్‌ దీప్తి, ఎన్‌ఐఎంహెచ్‌ఏఎస్‌ఎస్‌ వైద్యులు డాక్టర్‌ రవి యాదవ్‌, నిమ్స్‌ న్యూరాలజీ విభాగాల అధిపతులు డాక్టర్‌ ఎస్‌ఏ జబీన్‌, డాక్టర్‌ సూర్యప్రభ, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం 'హెల్త్‌ ఫార్ములా'

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల సమగ్ర ఆరోగ్యానికి దోహదపడే విధంగా 8-5-1-0 పేరిట హెల్త్‌ ఫార్ములాను రూపొందించినట్టు ఫ్యూచర్‌ ఫుడ్‌ ఫౌండేషన్‌ సీఈఓ పవన్‌ అగర్వాల్‌ తెలిపారు. మాదాపూర్‌లోని నోవోటెల్‌ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు 8 గంటల నిద్ర, 5 రకాల పండ్లు-కూరగాయలు ఆహారంలో భాగం కావాలని, ఒక గంట శారీరక శ్రమ చేయాలని, హానికర ఆహారం సున్నా (0)గా ఉండాలని సూచిస్తూ ఈ హెల్త్‌ ఫార్ములా రూపొందినట్టు వివరించారు. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమగ్ర అవగాహన కలిగించాలని కోరారు. కంట్రీ డిలైట్‌ సంస్థకు చెందిన చక్రధర్‌, మిల్లెట్‌ బ్యాంక్‌ వ్యవస్థాపకులు విశాల రెడ్డి, పలువురు నగర పాఠశాలల ప్రతినిధులు హాజరయ్యారు.

బాలాదిత్యకు అక్కినేని పురస్కారం



బాలాదిత్యను సత్కరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి: బాలనటునిగా ప్రవేశించి తెలుగుచలన చిత్రరంగంలో తనదైన శైలిలో రాణిస్తున్న బాలాదిత్య నటన ప్రశంసనీయమని పలువురు ప్రముఖులు అన్నారు. కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో బాలాదిత్యకు నటసామ్రాట్‌ అక్కినేని ప్రతిభా పురస్కార ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శతచిత్ర సినీ నిర్మాత రామ సత్యనారాయణ బాలాదిత్యను సత్కరించారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కాంగ్రెస్‌ నేత షేక్‌ పర్వేజ్‌, నిర్మాత మాగంటి ప్రసాద్‌, సామాజిక వేత్త బద్రీనాథ్‌, కాకుమాను జ్యోతి , సురేందర్‌, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం ఓటు హక్కును వినియోగించుకోవడానికి కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్‌(జేసీఎల్‌) శ్యామ్‌ సుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు వారి ఓటు హక్కు వినియోగించునే అవకాశం కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. లేని పక్షంలో చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు.

థర్మకోల్‌ పరిశ్రమలో అగ్నిప్రమాదం



శంషాబాద్‌: థర్మకోల్‌ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. గగన్‌పహాడ్‌ రైల్వే ట్రాక్‌ సమీపంలో ఉన్న రంగోలి ఈపీఎస్‌ పేరు మీద ఉన్న థర్మకోల్‌ పరిశ్రమలో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే అగ్నిమాపకసిబ్బందికి సమాచారం అందించారు. ఆరు అగ్నిమాపక బృందాలు పరిశ్రమ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. సుమారు ఆరులక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. పరిశ్రమలో పనిచేసే వారు హుటాహుటిన బయటికి పరుగులు తీశారు. ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టివేత

గచ్చిబౌలి: ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు వాహనాల తనిఖీలో ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టుకున్నారు. ఇన్నోవా వాహనంలో కోటి 60 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌ తెలిపారు. ఇవి జడ్చర్ల కాంగ్రెస్‌ అభ్యర్థి అనిరుద్‌రెడ్డికి సంబంధించినవని పోలీసులు తెలిపారు.

నర్సింగ్‌రావుగౌడ్ సేవలు ఎనలేనివి



నర్సింగ్‌రావుగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండారు విజయలక్ష్మి

ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింగ్‌రావుగౌడ్ బీజేపీకి అందించిన సేవలు ఎనలేనివని బండారు విజయలక్ష్మి అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లో బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావుగౌడ్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ నర్సింగ్‌రావుగౌడ్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, వరలక్ష్మి, కృష్ణప్రియ, వినుత, ప్రవీణ్, కంచి కుమార్, రిత్విక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముషీరాబాద్ బాద్‌షా ఎవరు..?

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- ముక్కోణపు పోటీతో ఉత్కంఠ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. రెండో సారి విజయం సాధించాలని ముఠా గోపాల్ తీవ్రంగా శ్రమిస్తుండగా, ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కించుకోవాలని అంజన్ ఆరాటపడుతున్నారు. ఇక మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజయ ఢంకా మోగించాలని పూస రాజు ఉవ్విళ్లూరుతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల బలాలు, బలహీనతలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్....

దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, వివాద రహితుడుగా, సౌమ్యుడిగా పేరు ఉంది. తన ఐదేళ్ల కాలంలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నూతన భవన నిర్మాణం, ఇందిరాపార్కులో ఆధునిక టెన్నిస్ కోర్టు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, 12 బస్తీ దవాఖానాల ఏర్పాటు, సర్కిల్–15 కార్యాలయ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన వారు ముషీరాబాద్‌లో 1.18 లక్షలు ఉన్నారని వారు తమకు తోడుగా ఉంటారని భావిస్తున్నారు. అయితే ఎన్నోమార్లు పర్యటించినా పనులు అంత వేగంగా పూర్తి కావడం లేదనే అపవాదు ఉంది. పార్టీ పదవులు దక్కకపోవడంతో సీనియర్ నేతల్లో నైరాశ్యం నెలకొంది. తన హయాంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థు ఎవరూ గెలవకపోవడం మైనస్ పాయింటే.

కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్...

సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి రెండుసార్లు ఎంపీగా పని చేసిన సమయంలో ఎందరికో సహాయ సహకారాలు అందించిన పేరుతో పాటు తన ఎంపీ నిధులను ఎక్కువగా ముషీరాబాద్ నియోజకవర్గానికే కేటాయించారని గుర్తింపు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తుండడంతో పాటు ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ ఓట్లల్లో కూడా విభజన జరిగిందనేది ప్రచారంలో ఉండడం ఆయనకు అనుకూల అంశం. టీజేఎస్, షర్మిల పార్టీతో పాటు పరోక్షంగా టీడీపీ సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అయితే ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడం బూత్ స్థాయిలో చెప్పుకోదగ్గ నిర్మాణం లేకపోవడం ప్రతికూల అంశాలు.

బీజేపీ అభ్యర్థి పూస రాజు...

నియోజకవర్గంలో బీజేపీకి బలమైన కేడర్ ఉండడం లక్ష్మణ్ అండదండలు ఉన్నాయి. బీసీ ముఖ్యమంత్రి ప్రకటనతో బీసీల్లో, ఎస్సీ వర్గీకరణ ప్రకటనతో ఎస్సీల్లో బీజేపీ పట్ల సానుకూలత పెరిగింది. గంగపుత్రుల కమ్యూనిటీకి చెందిన వాడు కావడంతో ఆ వర్గం నుంచి ఓట్లు పడే అవకాశం ఉంది. కాగా నియోజకవర్గంలో అంతగా పరిచయం లేకపోవడం, అభ్యర్థిని లేటుగా ప్రకటించడం ప్రతికూల అంశాలు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్దదైన ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా ఓట్లు వేయాలన్నారు. సమావేశంలో నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌సీని సందర్శించిన కలెక్టర్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్పీరోడ్డులోని సీఎస్ఐ వెస్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కొనసాగుతున్న కంటోన్మెంట్ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, కౌంటింగ్ (డీఆర్సీ) కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు తరలింపు, ఎన్నికలు పూర్తయ్యాక వచ్చిన ఈవీఎంలను భద్రపరచడం తదితర అంశాల గురించి చర్చించారు. అలాగే ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గాయిత్రి కృష్ణన్ కూడా డీఆర్సీ కేంద్రాన్ని పరిశీలించారు.

గోగీత షార్ట్‌ఫిలిం ప్రారంభం



షార్ట్‌ఫిలింను ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ, చంద్రశేఖర్

చిక్కడపల్లి: గోమాత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు కృషి చేస్తున్న ప్రముఖ రచయిత, 9 నంది అవార్డుల గ్రహీత డాక్టర్ నిట్టల(లక్ష్మణరేఖ) గోపాలకృష్ణ గోగీత పేరిట షార్ట్ ఫిలిం రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. గోగీత తను రచించి దానిని కుబేరా ప్రొడక్షన్స్ పేరిట నిర్మించడానికి సన్నాహాలు చేపట్టారు. బుధవారం చిక్కడపల్లి కృష్ణమందిరంలో షూటింగ్ ప్రారంభమైంది. తిరుమల బ్యాంక్ వ్యవస్థాపక చైర్మన్ ఎన్.చంద్రశేఖర్, కల్పవృక్షం లఘుచిత్ర నిర్మాత రాధాకృష్ణ, తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ గౌరీశంకర్ గోమాత వైభవంపై షార్ట్‌ఫిలిం రూపొందిస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో సినీ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు పాల్గొన్నారు.

ఓటుతో ప్రశ్నించే హక్కు



మాట్లాడుతున్న హిప్నో పద్మాకమలాకర్

చిక్కడపల్లి: ఓటు వేయడం ద్వారా ప్రశ్నించే హక్కును పొందవచ్చునని సైకాలజీ థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బుధవారం సాయంత్రం అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆమె మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోకపోవడంతో మేధావితనం మందగిస్తుందన్నారు. 40 నుంచి 50 శాతం మంది మేధావులు ఓటు హక్కును వినియోగించుకోకపోవడం విచారకరమన్నారు. సెలవు వచ్చిందని కాలక్షేపం చేయకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు వేయడమే కాకుండా ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనేలా తమ వంతు కృషి చేయాలన్నారు. శోభారాణి, పూర్ణకుమారి పాల్గొన్నారు.